కథ

# అద్దం మీద ఆవగింజ

- వలివేటి నాగచంద్రావతి

గుమ్మం పక్క బోర్డు మీద కాలింగ్‌బెల్ స్విచ్ కనబడుతున్నా తలుపులు దబదబ బాది, తలుపు తెరిచిన విశ్వాని పక్కకి నెట్టుతున్నట్టుగా లోపలికి వచ్చింది అన్నపూర్ణమ్మ.

మబ్బులేని వానలా తల్లి హఠాత్ ఆగమనానికి ఆశ్చర్యపడ్డాడు విశ్వా. "వస్తున్నట్టు ఫోనన్నా చెయ్యొచ్చు కదమ్మా" అన్నాడు అన్నపూర్ణమ్మ 'చేతిలోని బ్యాగ్ అందుకుంటూ.

"మరె, నీ అపాయింట్‌మెంట్ తీసుకుని ఎప్పుడు రమ్మనేదీ కనుక్కుని మరీ రావాలని తోచలేదు నాకు" రుసరుసలాడింది అన్నపూర్ణమ్మ.

తల్లి కోపానికి చిన్నగా నవ్వాడు విశ్వా. ప్రేమగా ఆవిడ చేయి పట్టుకుని నడిపించి సోఫాలో కూర్చోబెట్టాడు. పక్కనే కూర్చుని తల్లి భుజాల చుట్టూ చేతులు దండలా వేసి "మా అమ్మ ఎప్పుడు వచ్చినా నాకానందమే. తపస్సు చేయకుండా దేవుడు ప్రత్యక్షమైనట్టు.. . చెప్పకుండా వస్తే మరీ ఆనందం" అన్నాడు ఆప్యాయంగా. అప్పటికి కాస్త శాంతపడింది అన్నపూర్ణమ్మ.

అత్తగారిని పలకరించుదామని వచ్చి ఆ తల్లీ కొడుకుల్నే ముచ్చటగా చూస్తూండిపోయిన కోడలు వసుమతి, వాళ్ళు తన వంక చూడగానే "మామయ్యగారు బావున్నారండీ" అంది పరామర్శగా.

"ఆఁ ఆఁ, ఆయనగారికేం నిక్షేపంలా ఉన్నారు" అంది అన్నపూర్ణమ్మ కొంచెం మొహం ముడిచి.

భార్యని కాఫీ పెట్టమని పురమాయించి, ఆమె వెళ్ళాక తల్లికి ఇంకొంచెం దగ్గరగా జరిగాడు విశ్వా.

"ఏమయిందమ్మా?" అడిగాడు మృదువుగా.

నల్లమబ్బుకి చల్లగాలి సోకినట్టు కొడుకలా గోముగా అడిగేసరికి దుఃఖమొచ్చేసింది ఆమెకి. రుద్ధమయిన కంఠంతో "అదికాదురా" అంటూ చెప్పబోయి గబుక్కున ఆపేసింది.

'ఏమిటిది... ఇంత వయసొచ్చి, చిన్నపిల్లలా చాడీలు చెప్పడానికొచ్చిందను కోడూ - సమర్థింపు అటే ఉంటేనో..? వాడు కూడా ఆ తానులో ముక్కే కదూ' క్షణంలో తనను తాను సంబాళించుకుంది అన్నపూర్ణమ్మ. "ఏం లేదు, బాబ్జీని చూడాలనిపించింది... ఆగలేక వచ్చేశాను, అంతే" అంది కోడలు తెచ్చిన కాఫీ కప్పందుకుంటూ.

కారణం అది కాదని తెలుసు. కానీ మరి తరచలేదు విశ్వా. 'తనంతట తానే చెప్పనీ, బలవంతమెందుకు' అనుకున్నాడు. "సరే, నేను నాన్నకి ఫోన్ చేసి చెప్తాను, నువ్వు క్షేమంగా చేరావని" అన్నాడు లేస్తూ.

"అవసరంలేదులే. నేను బస్ దిగగానే చేశాను" ముభావంగా అంది అన్నపూర్ణమ్మ.

పాపం... పైకి చెప్పుకోటానికి తటపటాయించిందే కానీ అన్నపూర్ణమ్మ మనసు కళ పెళ్ళాడుతూనే ఉంది. అవును, నేను చేసింది తప్పే. కాదనటం లేదు. ఏదో- ఒక్కగానొక్క ఆడనలుసు. ముచ్చటపడింది. 'అమ్మా, నాకు వజ్రాల దిద్దులు పెట్టుకోవాలనుందమ్మా' అని. లక్షలు పోసి అవి కొనగల స్తోమతా తమది? ఆ మాటే చెప్పి సముదాయించి ఊరుకుందామంటే, అదిగో ఆ శకుంతలమ్మే ఆశ రేపెట్టింది. 'వదినా, ఆ సప్తగిరి ఏజెన్సీ వాడు వెయ్యి రూపాయలు కడితే నలభై రోజుల్లో పదివేలిస్తున్నాడు' అని. ఆవిడలాగే కట్టింది, పదివేలూ తెచ్చుకుంది. అలా పదింతలు డబ్బు తెచ్చుకున్నవాళ్ళని నలుగురైదుగుర్ని చూశాకే నేనూ కక్కుర్తిపడ్డాను. వెయ్యి కాదు, పదివేలు కడితే... నలభై రోజుల్లో లక్ష వస్తుంది - బిడ్డ కోరిక తీర్చొచ్చును గదా అని. ఓ కన్నతల్లిగా నేనలా ఆశపడ్డం తప్పా?

కాఫీ చుక్క చుక్కా తాగుతూ ఆలోచనల్లోకి జారిపోయిన అత్తగారితో "ఇదిగో అత్తయ్యా, బాబ్జీ బారసాలకి మా అమ్మావాళ్ళు ఈ గొలుసు ఇచ్చారు కదా... దానికి పులిగోరు పతకం చేయించాను." అన్నపూర్ణమ్మ చేతికి గొలుసు అందించింది వసుమతి.

"చూడమ్మా, ఈ వసు ఏం చేసిందో... ఫిక్సెడ్ డిపాజిట్ చేద్దామని నేను దాచిపెడితే చెప్పకుండా ఆ డబ్బు తీసుకెళ్ళి అది చేయించుకొచ్చింది" భార్యని కోపగించుకున్నట్టుగా అభినయించాడు విశ్వా.

"మీరు చెప్పండి అత్తయ్యా, ఆ డబ్బు బాబ్జీ బారసాలకి చదివింపుల్లో వచ్చిందే. దాంతో పులిగోరు లాకెట్ చేయించుదామని ముందే చెప్పాను. కాదు, ఫిక్సెడ్ అంటారు మీ అబ్బాయి. మరి, నా ముచ్చటెలా తీరుతుంది చెప్పండి. అందుకే, కామ్‌గా ఆ డబ్బు తీసుకెళ్ళి ఇది చేయించుకొచ్చేశాను. తప్పా అత్తయ్యా" అడుగుతోంది వసుమతి అల్లరిగా.

"గొప్ప పని చేశావు. అసలు నీకు బొత్తిగా నా భయం ఉంటేగా" అలక చూపించాడు విశ్వా మురిపెంగా.

'తను చేసిందీ ఇలాంటి పనే గదా - కొడుకు చూడు, ఎంత తేలిగ్గా తీసుకున్నాడో. ఈయనా ఉన్నారు - హ్హు'

అన్నపూర్ణమ్మ మళ్ళీ పరాకులోకి వెళ్ళిపోయింది.

ఆరోజు వంద రూపాయల కట్టలు రెండు తెచ్చి బీరువాలో పెట్టారాయన. 'ముట్టుకోకది. ఎందుకో తరవాత చెప్తా' అన్నారు. ఆ డబ్బు చూడగానే నాకా సప్తగిరివాడే మనసులో మెదిలాడు. పదివేలు ముడుపు కడితే లక్ష వరాలిస్తాడు. డైమండ్ దిద్దులు ఇస్తే కూతురి కళ్ళు మెరుస్తాయి. అది దేని తాలూకు డబ్బయితే నాకెందుకు? నలభై రోజుల్లో ఆ తీసిన పదివేలూ పువ్వుల్లో పెట్టి మరీ తీసినచోటే పెట్టేస్తే సరి' అనుకున్నా.

ఆ మాయదారి సప్తగిరివాడు నేను కట్టిన పదిహేను రోజులకే బోర్డు తిప్పేశాడు. నేనేం చేయను? లక్ష రూపాయలు చూపించి ఆశ్చర్యపరుద్దామనుకున్నానేగానీ ఇలా తల్లకిందులవుతుందని కలగన్నానా నేను.

అమ్మాయి పెళ్ళికని చేసిన అప్పు వడ్డీ తీరుమానం కోసం తన లీవు అమ్మగా వచ్చిన డబ్బట అది. నాకేం తెలుసు?

ఏనాడూ ఒక్క పరుషం మాట నోటరానీయని మనిషి పూనకమొచ్చినట్టు ఎన్ని తిట్టారు? ఎన్ని మాటలన్నారు? నాకు బుద్ధిలేదట, బాధ్యత తెలీదట, గృహిణికి ఉండాల్సిన లక్షణాల్లేవట. సొమ్ముల మీదా సోకులమీదా మోజట. ఇల్లు సర్వనాశనం చేస్తున్నానట. రామరామ, సగం ప్రాణం అప్పుడే చచ్చిపోయినట్టయింది నాకు. ముప్పై అయిదేళ్ళు కాపురం చేసిన ఇల్లాలికి వెయ్యాల్సిన చివాట్లేనా అవి?

సరే చేసింది అపరాధం. కోపంకొద్దీ నాలుగు మాటలన్నారు అనేగా- నేనూ కుక్కిన పేనల్లే కిక్కురుమనలేదు. అక్కడితో వదిలేయొచ్చును కదా- అబ్బే, తడిపిన తాటి ముడిలా బిగుసుకున్నారు. మాట్లాడ్డం మానేశారు. కంచంలో తనే వడ్డించుకు తింటున్నారు. క్షణానికోసారి 'పూర్ణా పూర్ణా' అనేవా



రల్లా - కన్నెత్తి చూడ్డంలేదు, పన్నెత్తి మాట్లాడ్డం లేదు. ఎంత శిక్ష అది? నన్ను అలా వెలివేయటం గుండెని నలిపేసినట్టుగా ఉండదూ. ఒకరోజు... రెండురోజులు... నాలుగు రోజులు... భరించలేకపోయాను ఆ చిత్రహింస.

అయినా మనిషన్నాక ఎప్పుడో ఒకప్పుడు పొరపాటు చేయకుండా ఉంటాడా? ఆ మాట కొస్తే తనవల్ల ఎప్పుడూ ఏ తప్పూ జరగలేదా?

ఆ శేషగిరికి 'ప్రాణమిచ్చే స్నేహితుడు. చిక్కుల్లో ఉన్నాడు. మనం ఆదుకోకపోతే ఎలాగ?' అని తెగ ఆరాటపడిపోయి పాతిక వేలు ముద్దకుడుముల్లా దోసిట్లో పోసొచ్చారే- ఏడాదయింది తిరిగిచ్చాడా?

అంతేమరి. ఆయనంటే మగమహారాజు. ఆయన చేస్తే ఒప్పు, నేను చేసింది తప్పు.

అయినా ఎంత ఆడదాన్నయితే మటుకు నాకు మాత్రం పౌరుషం, అభిమానం ఉండవా? నా అవసరం లేనట్టూ, ఉన్నా లేనట్టూ, పరాయిదాన్నన్నట్టూ చూస్తుంటే పడి ఉండటానికి - నాకూ ఉంది పంతం. అందుకే వచ్చేశాను. మూడు గంటలు ప్రయాణం. నా కొడుకు నన్ను నెత్తిన పెట్టుకుంటాడు. ఆయన బింకమెన్నాళ్ళో నేనూ చూస్తాను.

"అమ్మా లే... భోంచేద్దాం. నీ చేతిముద్ద తిని ఎన్నాళ్ళయిందో?" విశ్వా అన్నపూర్ణమ్మ రెక్క పట్టుకు లేపాడు.

★ ★ ★

రెండు రోజులు ట్రైమెలా గడిచిందో తెలియలేదు అన్నపూర్ణమ్మకి. ఉదయం పూట కోడలితో కలిసి దగ్గరలో ఉన్న దేవాలయాలు చుట్టి వచ్చింది. సాయంత్రాలు విశ్వా ఆఫీసు నుంచి వచ్చాక అందర్నీ మాల్స్‌కీ మ్యూజియంకీ ఓరోజూ... హోటల్‌కీ సినిమాకీ ఓరోజూ తీసుకువెళ్ళాడు. ఇంట్లో ఉంటే సరే సరి. బాబ్జీతో ఫూకుళ్ళూ కోడలితో వంటిల్లు డాట్‌కామ్‌లో చూపించే 'రెసిపీ'ల గురించిన చర్చలూ, కొడుకుతో కొత్తగా పెళ్ళయిన కూతురి కాపురం గురించిన ముచ్చట్లూ... గంటలు నిమిషాల్లా గడిచిపోయాయి.


ఈ రెండ్రోజులూ మగని మీద అలక కించిత్తు కరగలేదావిడకు. 'నువ్వెంత' అన్నట్టు మొహం తిప్పుకున్నారుగా- ఇప్పుడు తెలుస్తుంది నా విలువేమిటో- పదే పదే అనుకుంది తిరస్కారంగా.

మూడోరోజు మొదలైంది మధనం. 'ఎలా ఉన్నారో, ఏమిటో?' అన్న ఆలోచన వచ్చిన మొదలుకుని మనసు దిగాలుగా అయిపోతోందావిడకు. పోనీ, ఆ తలపు ఓసారొచ్చి పోతోందా అంటే- ఊహు, తింటున్నా తాగుతున్నా, కదిలినా మెదిలినా, ఘడియ ఘడియా బుర్రలోకి జొరబడి గడబిడ చేస్తోంది.

లేస్తూనే అనుకుంది- వాకింగ్‌కి వెళ్ళేప్పుడు పీది తలుపుకి తాళం జాగ్రత్తగా వేస్తున్నారో మరిచిపోతున్నారో అని. కోడలిచ్చిన బ్రూ కాఫీ తాగుతున్నప్పుడు ఫిల్టరు కాఫీ తప్ప వేరేది ముట్టని భర్తనే గుర్తుచేసుకుంది. 'ఫిల్టరుతో డికాక్షన్ తీయటమెలాగో తెలీదు గానీ స్ట్రాంగ్‌గా కాఫీ మాత్రం కావాలి' అని అక్కడలేని భర్తని సాధించింది లోలోపల. 'ఇంతకీ చేసుకోవటం చేతకాక కాఫీయే తాగటం మానేశారో ఏమో' అని బాధపడిపోయింది చివరికి.

స్నానం దగ్గరకొస్తే- ఆయనకి మసిలేంత వేడిగా కావాలి నీళ్ళు. పాపం ఎవరు కాచిస్తారిప్పుడు- అన్న చింత. భుజం నొప్పి అంటున్నారు ఈమధ్య. బకెట్లు మోస్తే ఎక్కువవుతుందో ఏమో ఖర్మ- అన్న ఆరాటం. మూడీగా అయిపోయింది అన్నపూర్ణమ్మ.

"ఏంటమ్మా, అంత పరధ్యానం? నాన్న మీదకి ధ్యాస మళ్ళిందా ఏం?" విశ్వా చిలిపి ప్రశ్న.



"ఆఁ మరే. మొన్నమొన్నే పెళ్ళయింది కదా. విరహం సహించలేకపోతున్నా- పోరా భడవా, నీ వేళాకోళాలూ నువ్వూనూ" అభిమానంగా కసిరింది అన్నపూర్ణమ్మ.

ముసిముసిగా నవ్వాడు విశ్వా.

"అత్తయ్యా, మీకిష్టమని పనసపొట్టు కూర చేశాను ఆవపెట్టి" అత్తగారి కంచంలో మరి కాస్త కూర వడ్డించింది వసుమతి.

విశ్వా ఆఫీసుకు వెళ్ళిపోయాక బాబ్జీని నిద్రపుచ్చి తీరుబాటుగా భోజనాలకు కూర్చున్నారు అత్తాకోడలిద్దరూ.

"నాకంటే కూడా మీ మామగారికి ఇదంటే ప్రాణం. ఆయనుంటే గనుక పిసరు మిగలకుండా ఈ కూర మొత్తం తినేసుండేవారు" మందహాసంతో అంది అన్నపూర్ణమ్మ.

"అవునా?"

"నాకా ఆవఘాటు నచ్చేది కాదు. ఆయన కోసమే పట్టుదలగా ఈ కూర చేయటం నేర్చుకున్నాను. 'ఎక్స్‌పర్ట్‌వయిపోయావు' అంటారాయనిప్పుడు..." గలగలా నవ్వింది అన్నపూర్ణమ్మ. అక్కడితో ఆపకుండా "మీ మావగారెంత మొహమాటం మనిషో తెలుసునా... 'నాకిది ఇష్టమూ' అని నోరు తెరిచి నాకన్నా చెప్పరు. మనసులోకి దూరి తెలుసుకోవాల్సిందే. అలా నేను కనిపెట్టిన వాటిల్లో ఇది ఒకటి."

పొద్దుట నుంచీ ఎందుకో ఒకందుకు మామగారినే తలచుకుంటున్న అత్తగారిని విచిత్రంగా చూసింది వసుమతి.

అర్థమైపోయిందావిడకు. 'ఛఛ, ఇలా పట్టుబడిపోయేలా ఆయన స్మరణేమిటి నాకు బుద్ధిలేకుండా' తనని తనే కేకలేసుకుంది లోలోపల.

కానీ ఇక తలచుకోకూడదనుకున్న ఆ మాట మీద ఎంతోసేపు నిలవలేకపోయిందావిడ.

మొదటి ముద్ద ఎత్తబోయిందా- 'భోజనానికి ముందు షుగర్ మాత్ర వేసుకోవాలాయన. జ్ఞాపకముంచుకుంటున్నారో లేదో?' అని బిగువు నటిస్తోన్న ఆవిడ్ని కుదిపి మరీ కలవరం రేకెత్తించిందా అనుమానం. 'సగమే వేసుకోవాలి ఆ టాబ్లెట్ - ముందే హెచ్చరించాడా డాక్టరు. మొత్తం వేసుకుంటే షుగర్ డౌనయి చెమట్లు పట్టేస్తాయి. నీరసమొచ్చేస్తుంది. ఒకప్పుడు తెలివి కూడా తప్పవచ్చు' అని. అందుకనే తనే జాగ్రత్తగా వేస్తుంటుందెప్పుడూ. 'పొరపాటున ఆయనగానీ ఆ మాత్రంతా వేసుకుంటేనో' - మరావిడకు కమ్మటి పనసపొట్టు కూర చేగటయిపోదూ.

★ ★ ★

ఆ రాత్రి అన్నపూర్ణమ్మకు నిద్రపట్టలేదు. పక్క కుదరని దానిలా మెసులుతూనే ఉంది.

నాకు మరీ తొందరపాటెక్కువ. ఇంకో రెండ్రోజులు పోయుంటే ఆయనే మామూలైపోయుండేవారు. 'మొగుణ్ణి కొట్టి మొగసాల ఎక్కిందనీ...' నేనే పెద్దది చేశాను విషయాన్ని.

'ఒకళ్ళకు నీతులు చెప్పాల్సిన వయసొచ్చిన దాన్ని... ఎంత కోపమొస్తే మటుకు ఇంటి బాధ్యతంతా వదిలిపెట్టేసి ఇలా వచ్చేయొచ్చునా. తప్పు నా దగ్గర పెట్టుకుని వేలెత్తి చూపించినందుకు ఆయన మీద అలగటమేమిటసలూ. చెమటోడ్చి సంపాదించిన సొమ్ము అనవసరంగా నష్టపెడితే ఎవర్కైనా శివాలెత్తవా. ఆ శేషగిరి విషయంగా ఆయన్నెన్నిసార్లు సస పెట్టలేదు నేను.'

పశ్చాత్తాపం మొదలైంది అన్నపూర్ణమ్మకి. పైగా ఆ షుగరు మాత్ర భయమొకటి. 'వచ్చేటప్పుడు జాగ్రత్తలన్నీ చెప్పన్నావచ్చాను కాను, పాపిష్టిదాన్ని. భగవంతుడా నేను వెళ్ళేదాకా ఆయన్ని చల్లగా చూడు.'

మిగతా రాత్రంతా గోడ గడియారం ముళ్ళ వంకా, కిటికీలోంచి నల్లగా కనబడుతోన్న ఆకాశం ఎప్పుడు తెల్లబడుతుందా అనీ చూడ్డంతోనే తెల్లారిపోయింది.

★ ★ ★

"నువ్వు ఆఫీసుకు వెళ్ళేముందు. నన్ను

బస్సెక్కించి వెళ్ళురా విశ్వా" అంది అన్నపూర్ణమ్మ.

"ఇంకో రెండ్రోజులుండి వెళ్ళకూడదా అత్తయ్యా. బాబ్జీ చూడండి మీమీదికెలా ఉరుకుతున్నాడో. ఇప్పుడిప్పుడే అలవాటవుతున్నారు మీరు వాడికి" బాబ్జీని అందించింది వసుమతి.

"అమ్మో ఇంకా ఉండటమే... వీడిమీద బెంగకొద్దీ వచ్చేశానే కానీ, ఇంట్లో నాకోసం ఎదురుచూస్తూ ఎన్ని పనులాగిపోయాయో. జాడీలో నిమ్మకాయ ముక్కలు కోసి పడేశాను. అవి ఎండలో పెట్టాలి. చెదురుమదురూ వానలు పడుతున్నాయి. ఆయనకసలే పరధ్యానం. పెరట్లో దండెం మీద ఆరేసిన బట్టలు తీశారో లేదో. ఆయనదసలే బక్కప్రాణం. భోజనం సరి లేకపోతే నీరసపడిపోతారు. ఇప్పటికే మూడు రోజులయిపోయింది. ఏమి తింటున్నారో ఏమిటో" తక్షణమే తను బయలుదేరకపోతే ప్రపంచం తల్లకిందులయి పోతుందన్నంత ఆదుర్దా పడిపోతూ మనవణ్ణి తిరిగి కోడలికందించేసింది అన్నపూర్ణమ్మ.

పెదవుల చాటున నవ్వు బిగించి "తయారయిపో అమ్మా" అన్నాడు విశ్వా.

'నాన్నకి సర్‌ప్రైజ్... అమ్మ హఠాత్తుగా ఇంటిముందు ఆటో దిగితే' తండ్రికి ఫోన్ చేసే ప్రయత్నం విరమించుకుంటూ



నవ్వుకున్నాడు మరోసారి.

★ ★ ★

బస్ ఆగింది. తిరిగి వెనక్కివెళ్ళే ఆ బస్‌లో సీటు కోసం అప్పుడే తొక్కిసలాట మొదలయింది.

"బస్సు అంతా ఖాళీ అయిపోతుందిక్కడ. మళ్ళీ పావుగంటకు గానీ బయలుదేరదు. ఎందుకంత తొందర" అని అరుస్తూనే ఉన్నాడు కండక్టరు. దిగేవాళ్ళని దిగనీయకుండా ఎక్కేవాళ్ళు తోసుకుని ఎక్కుతూనే ఉన్నారు.

బ్యాగ్ పట్టుకుని ఎదురొచ్చే జనాన్ని తప్పించుకుంటూ ఎలాగో డోర్‌దాకా వెళ్ళగలిగింది అన్నపూర్ణమ్మ. కానీ, స్టెప్ మాత్రం దిగలేకపోయింది. సాధ్యంకాని ఆ రద్దీలో ఆవిడ చేయి పట్టుకుని జాగ్రత్తగా కిందికి దింపారెవరో.

కృతజ్ఞతలు చెబుదామని తలెత్తింది. ఎదురుగా ఉన్నది భర్త రఘురామయ్య.

'అమ్మయ్య. ఈయన బానే ఉన్నారు' అన్నపూర్ణమ్మ మనసు దూదిపింజలా తేలికయిపోయింది. ఆందోళనంతా చేత్తో తుడిచేసినట్టూ, గుండెలో వెలితి అయిన భాగమేదో తిరిగి నిండినట్టూ, పరాయి దేశాన్నుంచి స్వస్థలానికి వచ్చినట్టూ... తృప్తిగా, హాయిగా, ఆనందంగా.

అప్పుడు చూసింది ఆయన భుజానికున్న ట్రావెలింగ్ బ్యాగ్‌ని. గతుక్కుమంది అన్నపూర్ణమ్మ. 'ఎక్కడికి వెడుతున్నారీయన. కొంప తీసి నాకులాగే కోపం కొద్దీ ఇల్లొదిలి...'

"ఎక్కడికీ?" అంది పెదాలు తడిచేసుకుంటూ.

తెచ్చికోలు గాంభీర్యంతో చూశారు రఘురామయ్యగారు. "నా ఇంటి లక్ష్మి కోసం బయలుదేరాను. అదృష్టం, తనే ఎదురొచ్చింది" అన్నారు గొంతు తగ్గించి.

అన్నపూర్ణమ్మ ఆయన కళ్ళలో పరీక్షగా వెతికింది 'నమ్మొచ్చునా' అన్నట్టు.

భర్త మొహంలో తాను పడినంత ఘర్షణా పడిన ఛాయలు ప్రస్ఫుటంగా.


సంతృప్తితో ప్రసన్నమయిందామె వదనం.

గుంభనంగా మందహాసం చేస్తూ భర్త చేతికి బ్యాగ్ అందించింది అన్నపూర్ణమ్మ. ★

# 63 సమాధులూ అతడి భార్యలవే!

**చరిత్రలో సామూహిక హత్యలూ, ఊహకందని అకృత్యాలకు ఎన్నో ఆనవాళ్లు ఇప్పటికీ కళ్లముందు కనిపిస్తూనే ఉంటాయి. కర్ణాటకలోని బీజాపూర్‌లో ఒకే చోట కొలువైన ఈ అరవై మూడు సమాధులూ అలాంటి ఓ సంఘటనకు సజీవ సాక్ష్యాలు.**

ప్రస్తుతం కర్ణాటకలో ఉన్న బీజాపూర్ రాజ్యం 17వ శతాబ్ధంలో ఆదిషాహి వంశస్తుల పాలనలో ఉండేది. రెండవ ఆదిల్ షా ఆ రాజ్యాన్ని సుదీర్ఘ కాలంపాటు పాలించినట్లు చరిత్ర చెబుతోంది. కానీ అతడి పాలనకు ఎప్పుడూ ఓ వైపు మరాఠా రాజు ఛత్రపతి శివాజీ, మరోవైపు మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ నుంచి ముప్పు పొంచి ఉండేది. ఎప్పుడు వాళ్లు రాజ్యం మీద దండయాత్ర చేస్తారోనని ఆందోళన చెందుతూ ఉండేవాడు. యుద్ధంలో వాళ్లతో గెలవడం కష్టమనిపించి సంధిని ఎరగా వేసి వాళ్లను అంతం చేయాలని రాజు ప్రణాళిక వేశాడు. ఆ బాధ్యతను సేనాపతి అఫ్జల్ ఖాన్‌కు అప్పగించాడు. అఫ్జల్ ఖాన్‌కు ఏ యుద్ధానికి వెళ్లే ముందైనా జ్యోతిష్కులను సంప్రదించే ముందడుగేయడం అలవాటు. ఛత్రపతి శివాజీ దగ్గరకు వెళ్లేముందు కూడా అతడు జ్యోతిష్కుల దగ్గరకు వెళ్లాడు. ఈసారి యుద్ధానికి వెళ్తే తిరిగిరావడం కష్టమేనని జ్యోతిష్కులు తేల్చిచెప్పారు.



అసలు సమస్య అప్పుడే మొదలైంది. అఫ్జల్ ఖాన్‌కు మొత్తం 65మంది భార్యలు. తాను ఛత్రపతి చేతిలో మరణిస్తే వాళ్లందరూ మళ్లీ పెళ్లి చేసుకుంటారేమోనని అతడు భయపడ్డాడు. అందుకే వాళ్లందరినీ ఊరి చివర ఉన్న బావి దగ్గరకు రమ్మని కబురు పంపాడు. భర్త ఆలోచన తెలియని వాళ్లంతా సంతోషంగా అక్కడికి వెళ్లారు. అందరూ చేరుకోగానే సైనికుల సాయంతో అఫ్జల్ వాళ్లందరినీ బావిలోకి తోసి చంపడం మొదలుపెట్టాడు. ఇద్దరు భార్యలు పారిపోవడానికి ప్రయత్నించగా వాళ్లు ఆ ప్రాంతానికి కొద్ది దూరంలో సైనికుల చేతిలో హతమయ్యారు. అందరూ చనిపోయారని ధ్రువ పరచుకున్నాక వాళ్ల మృత దేహాలను బయటికి తీయించి అక్కడే ఆరు వరసల్లో అరవై మూడు సమాధులను అఫ్జల్ నిర్మించాడు. మిగతా ఇద్దరు భార్యల సమాధులను వాళ్లు సైనికుల చేతిలో మరణించిన చోటే కట్టించాడు. శివాజీ దగ్గరకు బయల్దేరే ముందు తనకు కూడా భార్యల పక్కనే సమాధి నిర్మించమని మరీ వెళ్లాడు. ఆ తరవాత సంధి పేరుతో తనను మోసం చేయాలనుకున్న అఫ్జల్ ఖాన్‌ను ఛత్రపతి హతమార్చినట్లు చరిత్ర చెబుతోంది. ఏదేమైనా నల్లరాతితో నిర్మించిన ఈ సమాధులూ, బావి ఆ క్రూరత్వానికి సాక్ష్యాలుగా ఇప్పటికీ నిలిచి ఉన్నాయి. బీజాపూర్ నగరానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న 'సాఠ్ కబ్రు' అనే ఈ ప్రాంతం ఇప్పుడు పర్యాటకులను ఆకర్షిస్తోంది.

- గుంపర్తి కోదండరామ్